నేడు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ప్రారంభం

- రుద్రూర్‌లో సుమారు కోటి రూపాయల విరాళాలతో నిర్మాణం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయం

రుద్రూర్, ఫిబ్రవరి 26 : మండలకేంద్రంలో సుమారు కోటి రూపాయల విరాళాలతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆలయాన్ని నేడు (సోమవారం) ప్రారంభించనున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్ష్మీగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఐదేండ్ల క్రితం ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించగా.. విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కుర్లెం వసంతా పవన్ యాదవ్, మేడంపూడి శ్రీలతా దత్తువరప్రసాద్, వేదుళ్ల సంధ్యాసుధీర్‌రెడ్డితోపాటు దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసినట్లు కమిటీ చైర్మన్ బద్దం వసంతా సంజీవ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

టైలరింగ్ సర్టిఫికెట్ల అందజేత

సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తిచేస్తున్న మహిళలు

ఇందల్వాయి, ఫిబ్రవరి 26 : మండలంలోని గన్నారంలో అక్షయ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 50 మందికి మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపసర్పంచ్ గాండ్ల భైరయ్య, నాయకుడు బద్దంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు.

వీరసావర్కర్ స్మృతి దివస్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 26 : నిజామాబాద్ బార్ అసోసియేషన్, న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో స్మృతిదివస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు వీరసావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, న్యాయవాద పరిషత్ జిల్లా ప్రధానకార్యదర్శి జగన్మోహన్, బిట్ల రవి, ఉదయ్‌కృష్ణ, వసంత్‌రావు, శరత్‌చంద్ర, పిల్లి శ్రీకాంత్, కేశవరావు, నారాయణ, గోవర్ధన్, రాజు, వెంకటేశ్, నారాయణదాసు పాల్గొన్నారు.

టీయూ అభివృద్ధికి విద్యార్థి సంఘాలు కలిసికట్టుగా పనిచేయాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : యూనివర్సిటీ అభివృద్ధి కోసం విద్యార్థి సంఘాలు కలిసికట్టుగా పనిచేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ పున్నయ్య సూచించారు. టీయూలో పీడీఎస్‌యూ – టీయూ శాఖ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 26: ఆర్మూర్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గట్టు బస్వారెడ్డి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 26: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ యూసుఫ్‌తో కలిసి వారు లబ్ధిదారులకు సోమవారం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తాళ్లరాంపూర్, తడ్‌పాకల్ ఎంపీటీసీ సభ్యురాలు అడెం సవితాప్రసాద్, ఆర్ఐ సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.30 లక్షల విరాళం

దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 26:పెంటకుర్దులో మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి గొగినేని శ్రీనివాస్‌రావు సోమవారం రూ.30 లక్షల విరాళం అందజేశారు. గ్రామ పెద్ద శివసాయిపటేల్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రావు దంపతులను సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో పండితులు పలు దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. మాజీ సర్పంచులు వీరన్నపటేల్, మద్దినేని శ్రీనివాస్‌రావు, శివసేవకులు పాల్గొన్నారు.

బ్యాలెట్ యంత్రాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బ్యాలెట్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 26 : బ్యాలెట్ యంత్రాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సోమవారం సందర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను ఇటీవల నిర్వహించారు. తాజాగా జిల్లాకు అదనంగా 510 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు. కలెక్టర్ పలు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో బ్యాలెట్ యూనిట్లను తెరిపించారు. అనంతరం ఈసీఐఎల్ నుంచి వచ్చిన 13 మంది ఇంజినీర్లతో బృందంతో భేటీ అయ్యారు. బీయూల ప్రాథమిక పరిశీలన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉప ఎన్నికల అధికారిణి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

'ప్రజావాణి'కి 150 ఫిర్యాదులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 26 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులకు అందజేశారు.

కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

నిరసన తెలుపుతున్న నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 26 : నగరంలోని రైల్వేస్టేషన్ ఎదుట సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు కండ్లకు గంతలు కట్టుకొని, నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు వై.రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జి, భాష్పవాయువు ప్రయోగం, కాల్పులు చేయించడంతో ఇద్దరు రైతులు చనిపోయారని, వందలాది మంది గాయాలపాలయ్యారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన నల్లచట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

టీయూలో అంతర కళాశాలల ఉమెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : టీయూలో అంతర కళాశాలల ఉమెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఆరతి, చీఫ్ వార్డెన్ డాక్టర్ మహేందర్ రెడ్డి, తెలంగాణ వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ జి.బాలకిషన్, డాక్టర్ బీఆర్.నేత పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనల్లో టీయూ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఇటీవల నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌ల్లో టీయూ విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు బ్రహ్మానంద్, వెంకటేశ్, దన్నీయల్, శరత్ కుమార్, సుమిత్ర, అఖిల, సోనియాను టీయూ రిజిస్ట్రార్ యాదగిరితోపాటు ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, పోగ్రాం ఆఫీసర్ సంపత్, వెంకటేశ్వర్లు సోమవారం అభినందనలు తెలిపారు.

హోర్డింగ్‌పైకి ఎక్కి యువకుడి హల్‌చల్

- కాపాడిన పోలీసు సిబ్బంది



హోర్డింగ్‌పై వేలాడుతున్న వినోద్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 26 : జిల్లాకేంద్రంలో ఓ యువకుడు భారీ హోర్డింగ్‌పైకి ఎక్కి హంగామా సృష్టించాడు. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది.. చేయి జారీ కింద పడిన సదరు యువకుడిని పట్టుకొని ప్రాణాలు కాపాడారు. త్రీ టౌన్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కంఠేశ్వర్ ఏరియాలో ఓ ఇటుక వ్యాపారి వద్ద పనిచేసే వినోద్ ఆదివారం రాత్రి మద్యం తాగి నీలకంఠేశ్వరాలయం ఆలయం వద్ద డివైడర్ మధ్యలో ఉన్న హోర్డింగ్‌పైకి హంగామా సృష్టించాడు. స్థానికులు కిందకు దిగమంటే హోర్డింగ్‌ను పట్టుకొని వేలాడాడు. యువకుడు కిందికి పడిన సమయంలో త్రీటౌన్ సిబ్బంది షౌకత్, నర్సింహులు స్థానికుల సహాయంతో చేతుల్లో పట్టుకొని వినోద్‌ను కాపాడారు. హోర్డింగ్ పైనుంచి కిందపడితే ప్రాణాలు కోల్పోయేవాడని, వినోద్‌ను కాపాడిన సిబ్బంది, స్థానికులను పలువురు అభినందించారు. మద్యం మత్తులో ఉన్న వినోద్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మత్తు దిగిన అనంతరం అతడి భార్య కల్పనకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ చేసి హెచ్చరించి పంపారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి గోవర్ధన్

కోటగిరి, ఫిబ్రవరి 26 : పొతంగల్‌లో పల్స్‌పోలియోపై ఆరోగ్య విస్తరణాధికారి గోవర్ధన్ సోమవారం అవగాహన కల్పించారు. ఐదేండ్లలోపు చిన్నారులకు మార్చి 3వ తేదీన పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సూపర్‌వైజర్ జ్యోతి, సాయికుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : టీయూ అనుబంధ కళాశాలల్లో పీజీ మొదటి సెమిస్టర్, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో మూడో రోజు సోమవారం నిర్వహించిన పరీక్షను ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్ పరిశీలించారు. 1,911 మంది విద్యార్థులకు 1,801 మంది హాజరైనట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్‌గా రాచకొండ విఘ్నేశ్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్‌గా టీయూకి చెందిన లా ఫైనల్ ఇయర్ విద్యార్థి రాచకొండ విఘ్నేశ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని న్యాయ విద్యార్థుల కన్వెన్షన్ హాలులో ఆదివారం సమావేశం నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ హాజరై నియమించారు. విఘ్నేశ్ మాట్లాడుతూ.. కేరళ, కర్ణాటక తరహాలో లా విద్యార్థులకు రూ. 15 వేల స్టైఫండ్ అందజేయాలని, మూట్‌కోర్టులను ప్రతి న్యాయ కళాశాలలో ఏర్పాటు చేయాలని కోరారు.

ఉమామహేశ్వరాలయంలో అన్నపూజ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 26 : నగరంలోని ఉమామహేశ్వర ఆలయంలో మాఘ బహుళ విదియ, సోమవారం సందర్భంగా అన్నపూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

సంగీత కళాకారిణి స్వప్నారాణికి డాక్టరేట్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 26 : ప్రముఖ సంగీత కళాకారిణి, జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాల కర్ణాటక గాత్ర ఉపాధ్యాయిని స్వప్నరాణికి తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'ఇందూరు జానపదంలో శాస్త్రీయ ధోరణులు' అంశంపై చేసిన పరిశోధనకు ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. గైడ్ ప్రొఫెసర్‌గా శ్రీమతి సరస్వతి, వైవా ఎగ్జామినర్‌గా బాలసుబ్రహ్మణ్యం, శైలేశ్వరి, వాణి వ్యవహరించారని స్వప్నారాణి తెలిపారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

ఇందల్వాయి/ సారంగపూర్/ జక్రాన్‌పల్లి/ చందూర్, ఫిబ్రవరి 26 : జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. రూరల్ మండలంలోని ధర్మారం(ఎం)లో సీనియర్ నాయకులు, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షులు కనక రవి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. చందూర్ మండలంలోని ఘన్‌పూర్‌లో డ్రేనేజీ నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ దశాగౌడ్ ప్రారంభించారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేకపూజలు

పూజాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 26 : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు చేశారు. అయ్యప్ప స్వామికి స్వర్ణఖడ్గ బహూకరణ కార్యక్రమంలో భాగంగా చండీహోమం, అన్నదానం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి పర్యవేక్షణలో పూజలు కొనసాగాయి. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మేయర్ దండునీతు కిరణ్, ప్రజాప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు, నర్సరీల పరిశీలన

ధర్పల్లి, ఫిబ్రవరి 26 : మండలంలోని కోటాన్‌పల్లి, ప్రాజెక్టు రామడుగు, గోవింద్‌పల్లిలో ఉపాధి హామీ పనులు, నర్సరీలను ఎంపీడీవో బాలకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉపాధి పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

సంక్షిప్తంగా..

- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : గ్రూప్ పరీక్షల నేపథ్యంలో ఇంటిగ్రేడెట్ కోర్సు చదివిన విద్యార్థులకు డిగ్రీ మెమోలు అందజేయాలని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి సోమవారం వినతిపత్రం అందజేశారు.
- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 26 : ఫర్టిలైజ్, ఫెస్టిసైడ్ మండల అసోసియేషన్ కార్యవర్గాన్ని మండలకేంద్రంలో మొదటిసారిగా సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, కార్యదర్శిగా వినోద్, సభ్యులుగా సాంబశివ రావు, రమేశ్, రాజు, మహేందర్, శ్రీనివాస్, రాజాశేఖర్, మురళి, శ్రీకాంత్, ప్రవీణ్, తిలక్, సురేశ్‌ను ఎన్నుకున్నారు.
- సిరికొండ, ఫిబ్రవరి 26 : సిరికొండ, ధర్పల్లి మండలాల్లో బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు బెల్ట్ దుకాణాలను మూసివేయించాలని కోరారు.
- భీమ్‌గల్/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 26: భీమ్‌గల్ పట్టణంలోని బోయగల్లీలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్, మండల ప్రెసిడెంట్ పవన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మొండి దినేశ్, అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి, ప్రధానోపాధ్యాయులు దుర్గారెడ్డి పాల్గొన్నారు.
- నందిపేట్, ఫిబ్రవరి 26: ప్రతి ఒక్కరూ సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. వివిధ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- బాల్కొండ, ఫిబ్రవరి 26: నాగపూర్ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, గోదావరి తీరాన ఉన్న ఆలయంలో శ్రీ నాగలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఈనెల 27 నుంచి 29 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. 29న అన్నదానం నిర్వహిస్తారు.
- భీమ్‌గల్, ఫిబ్రవరి 26: మెండోరా గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మల్లన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ముగిశాయి. 4వ రోజు సోమవారం భక్తులకు అన్నదానం చేశారు.
- భీమ్‌గల్, ఫిబ్రవరి 26: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పట్టణ న్యూఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ తరపున రెండు బ్యాండ్ డ్రమ్స్, స్టిక్స్‌ను అందజేశారు. భీమ్‌గల్ ఎస్సై, సర్వసభ్య సమాజ్ అధ్యక్షుడు శవ్వ అశోక్, మహిళా సంఘాల సీనియర్ నాయకులు పాల్గొని విద్యార్థులకు ఈ డ్రమ్స్‌ను అందజేశారు. ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ఎస్సై అందజేసి అభినందించారు.
- మోర్తాడ్, ఫిబ్రవరి26: సుంకెట్‌కు చెందిన నర్సయ్య గుండె ఆపరేషన్ కోసం నిమ్స్ దవాఖానలో చేరగా రూ.1.60లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి మంజూరు చేయించారు. దానిని నర్సయ్యకు అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు తెలిపారు.
- వేల్పూర్, ఫిబ్రవరి 26: స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
- కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 26: చౌట్‌పల్లిలో సోమవారం ఇంటి పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రూ.1,50,149 వసూలు అయినట్లు గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఎం.ఆంజనేయులు తెలిపారు. ఎంపీవో సదాశివ్, జీపీ కార్యదర్శి గంగాజమున తదితరులు పాల్గొన్నారు.
- బోధన్, ఫిబ్రవరి 26: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను ఈనెల 27న(నేడు) 'కాయకల్ప' అధికారుల బృందం సందర్శించనున్నది. గతంలోనూ ఈ దవాఖాన కాయకల్ప పథకంలో అవార్డు సాధించింది. మరోమారు అవార్డు పొందే దిశగా స్థానిక అధికారుల చర్యలు చేపట్టారు.
- రెంజల్, ఫిబ్రవరి 26: మండల కేంద్రం నుంచి మంగళవారం చేవెళ్లకు 50 మంది మహిళలు తరలివెళ్తారని ఐకేపీ ఏపీఎం చిన్నయ్య సోమవారం తెలిపారు. సీఎం రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించనున్న సభకు మహిళలు బస్సులో వెళ్తారని తెలిపారు.
- రెంజల్, ఫిబ్రవరి 26: సాటాపూర్‌లో మద్యం మైకంలో పల్లపు వెంకటిపై అదే కుటుంబానికి చెందిన నలుగురు దాడికి పాల్పడగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ సోమవారం తెలిపారు. వెంకటి తమ్ముడు హన్మంతు, మరదలు రూప, తండ్రి ఎల్లయ్య, తల్లి గుండమ్మ ఒకే కుటుంబానికి చెందినవారని, ఇంట్లో భోజనం చేస్తున్న వెంకటిని బూతులు తిడుతూ ఆయన తలపై నలుగురూ కర్రతో దాడి చేశారు. గాయపడిన వెంకటిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.
- రెంజల్, ఫిబ్రవరి 26: బోధన్ డిపో నుంచి కందకుర్తి మీదుగా ధర్మాబాద్ బస్ సర్వీస్‌లను పునరుద్ధరించినట్లు బోధన్ డీఎం మామిడాల శ్రీనివాస్ సోమవారం తెలిపారు.
- బోధన్ రూరల్, ఫిబ్రవరి 26: ఊట్‌పల్లి గ్రామంలో సోమవారం సీసీ డ్రైనేజీ పనులను ఎంపీటీసీ దియావత్ పీరుబాయి నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.
- నవీపేట,ఫిబ్రవరి 26: నాళేశ్వర్ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ మున్నూరు కాపు సంఘం నాయకులు సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారని బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు పేర్కొన్నారు.
- ఎడపల్లి, ఫిబ్రవరి 26: జానకంపేట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం విక్రయ కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ ప్రారంభించారు. బియ్యాన్ని తక్కువ ధరలకు ప్రజలకు అందిస్తామని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 26: ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శ్రీలతకు సికింద్రాపూర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సికింద్రాపూర్‌లోని సర్వే నంబర్. 562లోని 5 1/2 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన ఇద్దరు కబ్జా చేశారని పేర్కొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ భీమయ్య ఆలయానికి చెందిన మూడెకరాలు, పశువులు సేద తీరడానికి కేటాయించిన 2 1/2 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన ఇద్దరు కబ్జా చేశారన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. 250 మంది గ్రామస్తులు కార్యాలయానికి తరలివచ్చారు.

పాలెం గ్రామానికి చెందిన వేద, జ్యోతిష్య పండితులు సాహసం రంజిత్‌కుమార్ శర్మకు స్వర్ణనంది పురస్కారం లభించింది. డాక్టర్ కే.విశ్వనాథ్ 94వ జయంతి సందర్భంగా హైదరాబాద్ కళానిలయంలో ఆదివారం రాత్రి స్వర్ణనంది పురస్కారాన్ని అందుకున్నారు.
– మోర్తాడ్, ఫిబ్రవరి26

కాంగ్రెస్‌లోకి ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

బోధన్, ఫిబ్రవరి 26: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, మరో 16 మంది కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం బోధన్‌లోని ఇరిగేషన్ గెస్ట్ హౌజ్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నాతోపాటు కౌన్సిలర్లు లావణ్యా శ్రీనివాస్, ఖాందేశ్ సంగీత, గంగామోహన్ చక్రు, ఏనుగంటి వరలక్ష్మి, లింబాద్రిగౌడ్, సుంకరి ఈశ్వరి, లిక్కి శం